సాక్షి
విజయనగరం

గురువారం । 6 । మార్చి । 2025

రూ.371 కోట్లతో ఉపాధి పనులు

రామభద్రపురం: జిల్లాలో ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద రూ.371 కోట్లతో ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని డ్వామా పీడీ శారదాదేవి అన్నారు. రామభద్రపురం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఆమె పరిశీలించారు. 54,714 పనులు మంజూరు చేశామని 5 లక్షల 94 వేల మంది వేతనదారులు పనులు చేస్తున్నారన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

పార్వతీపురం రూరల్: భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని బాధితురాలు కె.అనసూయ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సంతోషి బుధవారం తెలిపారు. పార్వతీపురం మండలంలోని హిందూపురానికి చెందిన అనసూయకు సీతానగరం మండలం పాపమ్మవలసకు చెందిన చిన్నోడుతో వివాహమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
గురు (సా)	శుక్ర (ఉ)
6.09	4.48

న్యూస్‌రీల్

కనీస వేతనం చెల్లించాలి

- ఏపీ సమగ్రశిక్ష అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్
- జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన



మెంటాడ కేజీబీవీ ఎదుట నిరసన

విజయనగరం అర్బన్: కనీస వేతనం అందజేయాలని ఏపీ సమగ్రశిక్ష అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల ఎదుట బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆందోళన చేశారు. సమ్మె ఒప్పందాల మేరకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. ఈపీఎఫ్ అమలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ, కారుణ్య నియామకాలు, నిర్దిష్టమైన జాబ్ చార్టు, పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంపు, గ్రాట్యూటీ అమలు, ప్రతినెలా 1వ తేదీన వేతనాల చెల్లింపు తదితర డిమాండ్లు నెరవేర్చాలన్నారు. దీనికోసం ఈ నెల 11వ తేదీన విజయవాడ కేంద్రంలో నిరసన దీక్ష చేస్తామని ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ బి.కాంతారావు తెలిపారు. వివిధ మండలాల్లో చేపట్టిన నిరసనగా రాష్ట్ర కార్యవర్గం సభ్యులు రామకృష్ణ, ఉమామహేశ్వరరావు, లక్ష్మణరావు, శ్రీనివాస్, సతీష్, సర్వేశ్వరరావు, సీఆర్ఎంటీ నాయకులు రామకృష్ణ, కేజీబీవీ రాష్ట్ర నాయకులు పి.తేజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్యం షాపుల లాటరీ

- కల్లుగీత, సొండి కులాలకు విజయనగరం జిల్లాలో 16, పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు షాపులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉభయ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కల్లు గీత, సొండి కులాలకు కేటాయించిన 20 మద్యం షాపులకు సంబంధించిన లాటరీ ప్రక్రియ గురువారం నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిన తర్వాత ఇప్పటికే విజయనగరం జిల్లాలో 153, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించిన సంగతి తెలిసిందే. వాటికి ఇప్పుడీ 20 అదనం. జిల్లా యూనిట్‌గా కల్లు గీత, సొండి సామాజికవర్గాల వారికి వీటిని కేటాయించారు. శెట్టిబలిజ, యాత, సెగిడి, శ్రీసైన, సొండి సామాజిక వర్గాలకు చెందినవారు విజయనగరం జిల్లాలోని 16 దుకాణాల్లో కోటా ప్రకారం ఎక్కడివాటికైనా దరఖాస్తు చేసుకోడానికి అవకాశం ఇచ్చారు. అలా 308 దరఖాస్తులు వచ్చాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో శ్రీసైన, సెగిడి, సొండి కులస్తులు నాలుగు దుకాణాల్లో కోటా ప్రకారం దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించారు. దీంతో 60 దరఖాస్తులు దాఖలయ్యాయి.

'లాటరీ' ద్వారా కేటాయింపు...

జిల్లా యూనిట్‌గా కోటా ప్రకారం దరఖాస్తు చేసుకోవడానికి ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వం ఫీజు నిర్ణయించింది. ఏ4 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించారు. గత నెల 10వ తేదీన ఉభయ జిల్లాల్లో లాటరీ తీయడానికి ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాయిదా వేశారు. ఆ ప్రక్రియను ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ బి.శ్రీనాథుడు తెలిపారు. విజయనగరం జిల్లాలోని దుకాణాలకు సంబంధించి కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు లాటరీ తీస్తారు. పార్వతీపురం మన్యం జిల్లాలో దరఖాస్తుదారులకు కూడా అదే సమయానికి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో లాటరీ నిర్వహిస్తారు.

శ్రీరాముడే ఆదర్శం

- త్రిదండి చినజియర్ స్వామి



ప్రవచనాలు చేస్తున్న చినజియర్ స్వామి

పార్వతీపురం: ప్రతి ఒక్కరూ శ్రీరాముడును ఆదర్శంగా తీసుకొని కుటుంబ, రాజ్యవ్యవస్థను నిర్వహించాలని త్రిదండి చినజీయరు స్వామి పిలుపునిచ్చారు. సర్వజీవరాశులను పరిరక్షించాల్సిన బాధ్యత మనుషులదేనన్నారు. పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వికాస తరంగణి అధ్యక్షుడు యిండుపూరు గున్నేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన శ్రీరామ పాదుకా పట్టాభిషేకం వైభవంగా సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న చినజియర్ స్వామి మాట్లాడుతూ పూర్వం సంప్రదాయలకు విలువ ఇచ్చేవారని, అందుకే వారంతా ఎంతో సుఖసంతోషాలతో జీవించేవారన్నారు. సమాజంలో జీవించే ప్రతిఒక్కరూ మంచిని కోరుకోవాలన్నారు. అనంతరం శ్రీరామ పట్టాభిషేకం పూజలను జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆశలు ఆవిరి



- అధ్యక్షా.. అనాలనుకున్న టీడీపీ నాయకుల ఆశలపై నీళ్లు
- ఉమ్మడి విజయనగరం నుంచి ఏ ఒక్కరికీ దక్కని ఎమ్మెల్సీ సీటు
- సార్వత్రిక ఎన్నికల్లో రెబెల్స్‌కు చంద్రబాబు గట్టి హామీ
- అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ పదవిపై స్థానిక నాయకుల ఆశలు
- ఐదు ఖాళీల్లో అవకాశమిస్తారని అధిష్టానం వద్ద ప్రయత్నాలు
- కనీసం పరిశీలన జాబితాలోనూ పేరు లేకపోవడంతో నిరాశ!

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

శాసనసభకు వెళ్లడానికి వీలుగా టికెట్ ఇవ్వనప్పుడు కనీసం శాసనమండలికైనా వెళ్లి 'అధ్యక్షా...' అనడానికి అవకాశం వస్తుందని ఆశించిన స్థానిక టీడీపీ నాయకులకు నిరాశే ఎదురైంది. ఎప్పటివలే ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు తన మోసపూరిత మార్కురాజకీయం చూపించారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను ఊరించి ఉసూరుమనిపించినట్టే .. పార్టీ నాయకులను ఎన్నికల్లో వాడుకుని ఇప్పుడు వదిలేశారు. దీనిపై ఆ పార్టీ నాయకుల అనుచరగణం భగ్గుమంటోంది. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎమ్మెల్సీ ఆశ చూపించి అన్యాయం చేశారని మండిపడుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారి ఎమ్మెల్యేల కోటాలో ఐదు ఎమ్మెల్సీ సీట్లను గెలుచుకునే అవకాశం వచ్చింది. దీంతో తమకు అవకాశం వస్తుందని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలువురు టీడీపీ స్థానిక నాయకులు ఆశలు పెట్టుకున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో ఏ కోటాలో ఎమ్మెల్సీలను పంపడానికి అవకాశం వచ్చినా ఉత్తరాంధ్రకు పెద్దపీట వేసేవారు. అలా.. విజయనగరం జిల్లా నుంచి డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు శాసనమండలిలో అడుగుపెట్టడానికి అవకాశం వచ్చింది. సురేష్‌బాబుకైతే రెండోసారి కూడా ఎమ్మెల్సీ పదవి దక్కింది. అలాగే చంద్రబాబు కూడా తమకు అవకాశం ఇవ్వకపోతారా? అని ఆశించిన ఉభయ జిల్లాల నాయకులకు ఆశాభంగమైంది. ఒక అవకాశం ఇవ్వకపోతారా అని అధిష్టానం వద్ద విశ్వప్రయత్నాలు చేసినా తుదకు ఆశావహుల జాబితాలోనూ వారిని పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం.

నామినేటెడ్ పదవులతో సరి...

ఎమ్మెల్యే అవదామనుకున్న కర్రోతు బంగార్రాజు తనకు కనీసం ఎమ్మెల్సీ పదవి వస్తుందని ఆశించారు. కానీ ఆయనకు నామినేటెడ్ పదవి ఇవ్వడంతో మిన్నకుండక తప్పలేదు. ఆర్‌పీ భంజ్‌దేవ్, తెంటు లక్ష్మునాయుడు, కావలి గ్రీష్మలతో పాటు బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే సుజయ్ కృష్ణ రంగారావుకు కూడా నామినేటెడ్ పోస్టులు ఇచ్చారు. అలా వారు కూడా ఎమ్మెల్సీ సీటు ఆశించకుండా నీళ్లు చల్లేశారు. ఇక మిగిలింది గొంప కృష్ణ, కిమిడి నాగార్జున, బొబ్బిలి చిరంజీవులతో పాటు మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు. తమకు నామినేటెడ్ పదవి ఇవ్వలేదంటే ఎమ్మెల్సీ సీటు వస్తుందని ఆశలు పెట్టుకున్నారు. అధిష్టానం వద్ద విశ్వప్రయత్నాలు చేసినా చివరకు వారి పేర్లు పరిశీలనలోకైనా తీసుకోలేదని తెలిసి మౌనంగా ఉండిపోయారు.

ఊరించి.. ఉసూరుమనిపించి...

గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ టికెట్ వస్తుందని కర్రోతు బంగార్రాజు, గొంప కృష్ణ, కిమిడి నాగార్జున, బొబ్బిలి చిరంజీవులు, ఆర్‌పీ భంజ్‌దేవ్, తెంటు లక్ష్మునాయుడు, కేఏ నాయుడు, కావలి గ్రీష్మ... ఇలా పలువురు నాయకులు తమ నియోజకవర్గాల్లో పట్టు పెంచుకున్నారు. టికెట్ ఇవ్వకపోతే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎక్కడ టీడీపీ అభ్యర్థులకు దెబ్బ కొడతారోనని ఊహించిన చంద్రబాబు... వారందర్నీ 'ఎమ్మెల్సీ' ఆశల పల్లకి ఎక్కించారు. వారంతా మనసు మార్చుకొని పార్టీలో తమ పోటీదారులకు మద్దతు పలికారు. ఎలాగో గెలిచి పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో వారంతా అధిష్టానం తమకు ఇచ్చిన హామీ నెరవేర్చుతుందని ఆశించారు.

'కొల్ల'కైతే ఇప్పటికీ నిరాశే...

టీడీపీ అధిష్టానం హామీ ఇచ్చిందంటే ఎమ్మెల్సీ పదవి ఎంతవరకూ వస్తుందో టీడీపీ సీనియర్ నాయకుడు కొల్ల అప్పలనాయుడే ఓ ఉదాహరణ. రాజాం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సంతకవిటి మండలంలో తూర్పుకాపు సామాజికవర్గానికి చెందిన ఆయన గతంలో ఎంపీపీగా మూడు పర్యాయాలు పనిచేశారు. మరో రెండు దఫాలు తన అనుచరులను ఎంపీపీ పదవిలో కూర్చోబెట్టారు. తన భార్యను కూడా జెడ్పీటీసీగా ఒక పర్యాయం గెలిపించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఆయన్ను వాడుకొనే ఉద్దేశంతో చంద్రబాబు తాయిలం వేశారు. శ్రీకాకుళం జిల్లాపరిషత్ చైర్మన్‌ను చేస్తానని ఆశ చూపించారు. తీరా టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొండిచేయి చూపించారు. చౌదరి బాబ్జీ భార్య చౌదరి ధనలక్ష్మికి చంద్రబాబు ఆ పదవి కట్టబెట్టారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన కొల్ల అప్పలనాయుడిని బుజ్జగించడానికి చంద్రబాబు ఎమ్మెల్సీ అస్త్రం ఉపయోగించారు. 2017 ఫిబ్రవరిలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చాయి. అప్పుడు టీడీపీ టికెట్ తనకు ఇస్తారని ఆశించిన కొల్లకు చంద్రబాబు మళ్లీ జెల్లకొట్టారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వలస వచ్చిన శత్రుచర్ల విజయరామరాజుకు ఆ టికెట్ ఇచ్చేశారు. దీంతో రెబెల్‌గా బరిలోకి దిగేందుకు కొల్ల అప్పలనాయుడు సిద్ధమయ్యారు. నాడు శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగానున్న పరిటాల సునీత, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు హుటాహుటిన కొల్ల స్వగ్రామం మామిడిపల్లి వెళ్లి మరీ ఆయనను బుజ్జగించారు. నామినేటెడ్ పదవి ఇస్తామని, సముచిత స్థానం కల్పిస్తామని హామీల వర్షం కురిపించారు. ఆ తర్వాత రెండేళ్ల పాటు టీడీపీ అధికారంలో ఉన్నా కొల్ల కల నెరవేరలేదు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయినా కొల్లను కనీసం పట్టించుకోలేదు. అలా ఆయన 'ఎమ్మెల్సీ' ఆశ ఇప్పటికీ నెరవేరలేదు. అదీ చంద్రబాబు మార్క్ రాజకీయం.

నేటి నుంచి జామి ఎల్లారమ్మ జాతర



జామి ఎల్లారమ్మ తల్లి



భక్తుల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

శృంగవరపుకోట: భక్తుల కొంగుబంగారం జామి ఎల్లారమ్మ జాతరకు సర్వం సిద్ధమైంది. గురువారం నుంచి మూడురోజుల పాటు జరగనున్న జాతరకు జిల్లా యంత్రాంగం, దేవదాయశాఖ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఏటా మహాశివరాత్రి తర్వాత 9వ రోజున వచ్చే అష్టమినాడు ఎల్లారమ్మ పండుగ నిర్వహించడం ఆనవాయితీ. అమ్మవారి ఘటాలను గద్దె ఇంటి నుంచి ముహూర్తానికి ప్రధాన ఆలయానికి తీసుకెళ్తారు. గురువారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, శుక్రవారం పెద్ద తీర్థం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. జాతరకు పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో క్యూలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 200 మంది పోలీసులతో బందోబస్తు విధులు నిర్వహిస్తామని ఎస్ఐ వీరజానార్దన్ తెలిపారు. భక్తుల రాకపోకలకు అనువుగా ట్రాఫిక్ ఆంక్షలు విధించామన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



మహిళా ఆరోగ్యంపై ఐక్యరాగం వినిపిస్తున్న ఇన్‌చార్జి వీసీ రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ జయసుమ, విద్యార్థినులు

- జేఎన్‌టీయూ జీవీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విజయనగరం అర్బన్: ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థినులు విద్యాబుద్ధులతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి సూచించారు. యూనివర్సిటీ 'మహిళా సాధికారత మరియు ఫిర్యాదుల విభాగం' ఆధ్వర్యంలో వర్సిటీలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థి దశ నుంచి ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో రాణించగలమన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవిమాధవి మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన జీవనానికి మంచి ఆహారపు అలవాట్లు దోహదపడతాయని తెలిపారు. అనంతరం మహిళా ఆరోగ్యం అంశంగా నినాదాలుచేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.జయసుమ, బి.నళిని, వివిధ విభాగాల మహిళా అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాల్లో మౌలిక వసతులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

- కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ భవనాల్లో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం సాయంత్రం ఐసీడీఎస్ సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండి, టాయిలెట్, విద్యుత్ సరఫరా లేని భవనాల కచ్చితమైన జాబితాను వెంటనే అందించాలని కోరారు. ప్రతి నెలా పిల్లల బరువును నమోదు చేసేటప్పుడు కచ్చితంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని సూపర్‌వైజర్ తనిఖీ చేసి కార్యకర్త, ఆయా, ఆశ, ఏఎన్ఎంలను దగ్గర పెట్టుకుని పిల్లల బరువు, ఎత్తు నమోదు చేయాలని చెప్పారు. న్నారు. అందరి రిజిస్టర్లు ఒకేవిధంగా ఉండాలని ఆదేశించారు. పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జి పీడీ ప్రసన్న, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, విద్యుత్‌శాఖ ఎస్ఈ లక్ష్మణరావు, డీపీఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు



పోలీస్ స్టేషన్‌లో సీపీఎం నాయకులు శ్రీనివాసరావు, సురేష్

బొబ్బిలి: ఆశ వర్కర్ల ఆవేదన గళం వినిపించకుండా నొక్కేసే చర్యలకు కూటమి ప్రభుత్వం ఉపక్రమించింది. ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 6న విజయవాడలో నిర్వహించే ధర్నాకు ఎవరూ తరలివెళ్లకుండా ముందస్తు అరెస్టులకు ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలో సీపీఎం నాయకులు ఎ.సురేష్, బలస శ్రీనివాసరావును పోలీసులు అరెస్టుచేసి బొబ్బిలి స్టేషన్‌కు తరలించారు. ఇది సరైన విధానం కాదని, ఉద్యమాలను అణచలేరని, పరిష్కారం ఒక్కటే మార్గమని నాయకులు ఉద్ఘాటించారు.

ముగిసిన కనకమహాలక్ష్మి జాతర



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దేవదాయశాఖ సిబ్బంది

చీపురుపల్లి: భక్తుల కొంగుబంగారం కనకమహాలక్ష్మి అమ్మవారి 27వ జాతర మంగళవారం అర్ధరాత్రితో ముగిసింది. ఈ నెల 2, 3, 4 తేదీల్లో జరిగిన జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు.

అమ్మవారి హుండీల ఆదాయం రూ.24,66,278

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మూడు రోజుల జాతరలో రూ.24,66,278ల ఆదాయం లభించినట్లు దేవదాయశాఖ ఈఓ బి.శ్రీనివాస్ తెలిపారు. టికెట్ల రూపంలో రూ.10,19,156లు, హుండీల నుంచి రూ.14,47,302లు, ఒక గ్రాము బంగారం, 80 గ్రాముల వెండి లభించిందన్నారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జి.శ్యామ్‌ప్రసాద్ పర్యవేక్షణలో హుండీల ఆదాయం లెక్కింపు సాగింది.

వీడని జ్వరాలు



జ్వరంతో ఉన్న చిన్నారిని చూపుతున్న తల్లి

- అస్వస్థతకు గురవుతున్న చిన్నారులు
- కారణాలపై స్పష్టత కరువు
- ఆవేదనలో గిరిజన ప్రజలు

శృంగవరపుకోట: మండలంలోని గిరిశిఖర గ్రామాల చిన్నారులను జ్వరాలు వీడడం లేదు. మందులు వాడుతున్నా తగ్గినట్టే తగ్గి మళ్లీ సోకుతున్నాయంటూ చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. మంచం పట్టిన చిన్నారులను చూసి తల్లడిల్లుతున్నారు. కొద్దిరోజుల కిందట ధారపర్తి పంచాయతీ పరిధిలోని గిరిజన గ్రామాల్లో వంటిపై పొక్కులు, తీవ్రమైన జ్వరంతో చిన్నారులు మంచం పట్టిన విషయం తెలిసిందే. ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్యం అందించడంతో ప్రాణాలు నిలబడ్డాయి. ఇప్పుడు రాయపాలెం, పల్లపుదుంగాడ పార్లు, మున్నపురాయి గ్రామాల చిన్నారులను జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. రాయిపాలెంలో ముగ్గురు చిన్నారులు మలేరియాతోను, పల్లపుదుంగాడలో ఒక చిన్నారి వంటిపై పొక్కులతో బాధపడుతున్నారు. మందులు వాడుతున్నా జ్వరాలు తగ్గడంలేదంటూ తల్లిదండ్రులు మందుల సీసాలను చూపించి ఆవేదన చెందుతున్నారు.

గిరిజనుల్లో ఆందోళన..

చిన్నారుల ఒంటిపై పొక్కులు రావడం, జ్వరాలు సోకడం, మరికొందరు తరచూ జ్వరాల బారిన పడుతుండడంతో తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. వైద్యులు వైద్యశిబిరాలు నిర్వహించి మందులు అందజేస్తున్నా జ్వరాల వ్యాప్తి కట్టడి కాకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. జ్వరాలకు కారణం నీరు, గాలి, పర్యావరణ కాలుష్యాలు ఏమైనా కావచ్చని వైద్యులు చెబుతున్నా... స్పష్టమైన కారణం నేటికీ నిర్ధారణ కాలేదు. ఇప్పటికైనా మూలాలు కనుక్కొని వైద్య సేవలు అందించాలని, జ్వరాలను కట్టడిచేయాలని గిరిజన యువకులు కోరుతున్నారు.

కంటితుడుపు వైద్యమే...

> జ్వరాలు, వంటిపై పొక్కులతో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. వైద్య బృందాలు వచ్చివెళ్లినా జ్వరాలు మాత్రం తగ్గుముఖం పట్టలేదు. జ్వరాల నివారణకు వైద్యులు చర్యలు తీసుకోవాలి. గిరిశిఖర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందజేయాలి.
>
> – జి.గౌరీష్, ఏపీ గిరిజన సంఘం నేత



జ్వరాలతో బాధపడుతున్న గిరిజన కుటుంబం

మెనూ అమలు చేయకుంటే చర్యలు

- సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామానందం
- ఎల్.కోట ఎస్సీ బాలుర వసతిగృహం సందర్శన
- మెనూ అమలు, సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్న డీడీ
- హాస్టల్ వార్డెన్‌కు షోకాజ్ నోటీస్ జారీ



మెనూ అమలు తీరు, వసతిగృహంలోని సమస్యలను విద్యార్థులను అడిగి తెసుకుంటున్న డీడీ రామానందం

లక్కవరపుకోట:

సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాస్టల్స్‌లో ప్రభుత్వం సూచించిన మెనూ కచ్చితంగా అమలుచేయాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని ఆ శాఖ డీడీ బి.రామానందం హెచ్చరించారు. ఎల్.కోట ఎస్సీ బాలుర వసతిగృహ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై 'ఆరుబయట స్నానం.. నేలపైనే నిద్ర' అనే శీర్షికన 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన వార్తకు సాంఘిక సంక్షేమశాఖ డీడీ స్పందించారు. వసతి గృహాన్ని పరిశీలించారు. హాస్టల్‌లో మెనూ అమలు, సౌకర్యాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాలు, పండ్లు ఇవ్వడం లేదని, మెనూ అమలుచేయడంలేదని డీడీకి విద్యార్థులు తెలిపారు. మంచినీటి ట్యాంక్ పగిలిపోయి నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయించకపోవడంపై వార్డెన్ కొల్లు గౌరినాయుడుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. డీడీ దగ్గరుండి కొత్త వాటర్ ట్యాంక్‌ను, వంట చేసేందుకు అనువుగా పొయ్యిని ఏర్పాటుచేయించారు. మెనూలో పొందుపర్చిన వంటలను కచ్చితంగా వడ్డించాల్సిందేనని, లేదంటే నేరుగా ఫోన్‌చేసి తెలియజేయాలని విద్యార్థులకు తన ఫోన్ నంబర్‌ను ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వసతిగృహ సమస్యలను గుర్తించామని, మెనూ అమలుతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తామన్నారు. వసతిగృహ నిర్వహణలో నిర్లక్ష్యం, మెనూ చార్టు అమలుచేయకపోవడంపై హాస్టల్ వార్డెన్‌కు షోకాజ్ నోటీస్ జారీచేశామన్నారు. నివేదికను కలెక్టర్‌కు అందజేసి తదపరి చర్యలు తీసుకుంటామని డీడీ తెలిపారు.



హాస్టల్ వార్డెన్ గౌరినాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీడీ